క్లుప్తంగా

సాహిత్య రచన జరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్య దీపికలుగా సాహిత్య రచన జరగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కవి డప్పోల రమేష్ సంపాదకత్వంలో వచ్చిన 'ఎండ్లూరి కవన కళ స్మారక స్వరం' పుస్తక పరిచయ సభ జరిగింది. అతిథులు, వక్తలుగా ప్రముఖ కవులు మారుతి, భార్గవ, వెంకటకృష్ణ, పాణి, డాక్టర్ అరుణ, కెంగార మోహన్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఆధునిక కవిత్వం మల్లె మొగ్గల గొడుగులా కవిత్వపు నీడనిస్తున్న ఉద్యమ కవిత్వాన్ని అక్షరీకరించిన ధిక్కార కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ అన్నారు. ఆయన ఈ కాలపు మహోజ్వలిత దళిత ఉద్యమకారుడని అన్నారు. ఎండ్లూరి కవిత్వం నిండా ఆర్తి, ఆర్ద్రతలే ఉంటాయన్నారు. కవులు జంధ్యాల రఘుబాబు, అయ్యన్న, ఎస్‌డీవీ అజీజ్, ఏవీరెడ్డి, సయ్యద్ జహీర్ అహ్మద్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఆదివారం 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, కేసీ కాల్వకు 817 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో చెప్పారు. దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై వ్యాయామం చేయించటం జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యబోధన చేస్తారన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చునని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

టీచర్లకు సావిత్రీబాయి అవార్డులు

ఓర్వకల్లు: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే అవార్డులను మండలంలోని పలువురు మహిళా ఉపాధ్యాయురాళ్లకు అందజేసినట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య తెలిపారు. మండల విద్యాశాఖ అధికారిణి సునందతో పాటు టీచర్లు శారదమ్మ(లొద్దిపల్లె), కె. పద్మజ (నన్నూరు), జబీన్‌బేగం (నన్నూరు), వెంకటేశ్వరమ్మ(ఓర్వకల్లు), కె.పద్మ (కొమరోలు), లక్ష్మీనరసమ్మ(చెన్నారెడ్డిపల్లె), సరస్వతమ్మ (జెడ్పీహెచ్ఎస్ హుసేనాపురం), ఎస్ సుశీలబాయి (కేతవరం)కి అవార్డులు ప్రదానం చేసినట్లు వెల్లడించారు. ఆదివారం కర్నూలులో జరిగిన ఈ కార్యక్రమానికి కడప ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఎస్ఎస్‌సీ డైరెక్టర్ దేవానందరెడ్డి, కర్నూలు డీఈఓ రంగారెడ్డి అతిథులుగా హాజరైనట్లు ఆయన విలేకరులకు వెల్లడించారు.

మార్చిలో విద్యుత్ సర్కిల్ డే

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ కర్నూలు సర్కిల్ డే వేడుకలను మార్చిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

సి.బెళగల్: మండలంలో పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. 21 గ్రామాల్లో మొత్తం 7,236 మంది పింఛన్‌దారులుండగా అందులో 97.34 శాతం మందికి ఇప్పటి వరకు పింఛన్లు అందించినట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. అందరికీ పింఛన్ అందించాలనే ఉద్దేశంతో సెలవుదినం ఆదివారం సైతం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.



కర్నూలు పెద్దాసుపత్రిలో దివ్యాంగురాలు షేక్ ఫర్వీన్‌కు పింఛన్ అందజేస్తున్న ముడుమాల గ్రామ వలంటీర్ రామచంద్ర

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 26, 35వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం





మహిళకు వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ పరిధి 26వ వార్డు 67వ వార్డు సచివాలయం పరిధిలోని కృష్ణానగర్, తారక రామానగర్, 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలో ఉమామహేశ్వర్ నగర్‌లలో ఆయా వార్డుల కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, సాపురు మాధురి, వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఎమ్మెల్యే, మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి వారు ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే కాలనీల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అర్హతే ప్రమాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సిఫారసులు, నాయకుల అండదండలు ఉండేవారికే పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, మిద్దె చిట్టెమ్మ, పల్లె శారద, విక్రమసింహారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు యాదవ్, నంద్యాల పార్లమెంటరీ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, నాయకులు బాలచంద్రారెడ్డి, సత్యంరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎం. సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుందర నగరంగా కర్నూలు

కల్లూరు: కర్నూలును సుందర నగరంగా తీర్చిదిద్దుతామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 26వ వార్డులోని సవారమ్మ గుడ్డి దగ్గర రూ. 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 14లక్షలతో నూతనంగా నిర్మించిన శానిటేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కర్నూలును ఆదర్శనగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు నిధులు ఇచ్చారని ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. రూ.24 కోట్లతో గోరంట్ల బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించామన్నారు. ఆదివారం కర్నూలులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న శాసనసభ సాధారణ ఎన్నికల్లో కోడుమూరు నుంచి తిరిగి తానే పోటీ చేస్తానని, 50వేల భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుంటే కొందరు టీడీపీ నేతలు ఓర్వలేక తనపై తప్పుడు రాతలు రాయిస్తున్నారన్నారు. కోర్టులో కేసులు వేస్తూ అభివృద్ధిని అన్ని విధాలుగా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నకుమార్, వాసు, గిప్సన్, రవిశాస్త్రి, బాలకృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ఉంది..బస్సు కావాలి



గూడూరు నుంచి ప్యాలకుర్తి వెళ్లే రోడ్డు

గూడూరు రూరల్: గూడూరు నుంచి ఆర్.ఖానాపురం మీదుగా రేమట వరకు, గూడూరు నుంచి ప్యాలకుర్తి వరకు ప్రభుత్వం బీటీ రోడ్డు వేసింది. ఒకప్పుడు ఆయా రోడ్లు గుంతల మయంగా ఉండేవి. దీంతో రోడ్లు సరిగ్గా లేవని ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు రద్దు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి తిరుగుతున్న బస్సు సర్వీసు హఠాత్తుగా రద్దు కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను గుర్తించి ప్రభుత్వం ఆయా గ్రామాల రహదారులను బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసింది. అయితే, ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను ఏర్పాటులో జాప్యం చేస్తుండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితిలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి గూడూరు నుంచి ఆర్.ఖానాపురం మీదుగా రేమటకు, గూడూరు నుంచి ప్యాలకుర్తి మీదుగా కోడుమూరుకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

నాణ్యమైన ఎరువులు పంపిణీ చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ చట్టాలు, క్వాలిటీ కంట్రోల్‌పై పూర్తి అవగాహన పెంచుకొని, ఇందుకు అనుగుణంగా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సరఫరా చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కార్యక్రమం కింద ఇన్‌పుట్ డీలర్లకు క్వాలిటీ కంట్రోల్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎరువుల నియంత్రణ చట్టం -1985లోని ముఖ్యమైన విషయాలను ఇన్‌పుట్ డీలర్లకు వివరించారు. డీలర్లు కేంద్రప్రభుత్వం గుర్తించిన రసాయన, సేంద్రియ, బయోస్టిములైన్స్, నూనె తీసిన వేప, ఆముదం, కానుగ చెక్కలను మాత్రమే మార్గదర్శకాలకు లోబడి విక్రయించాలని సూచించారు. అన్ని రకాల ఎరువుల తయారీదారులు సెంట్రల్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. లైసెన్స్ తీసుకునే విధానం, రికార్డుల నిర్వహణ గురించి వివరించారు. ఎరువుల తనిఖీ అధికారి వచ్చినపుడు అన్ని రకాల రికార్డులను చూపాలన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశీ ఇన్‌పుట్ డీలర్లకు పంటల చీడపీడలు చిత్ర పటాలు గీసేందుకు డ్రాయింగ్ రిజిష్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేశీ సమన్వయకర్త, విశ్రాంత ఏడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందన

కర్నూలు (న్యూటౌన్): 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 2 నుంచి 4 వరకు జగ్గయ్యపేటలో జరిగాయి. ఇందులో కర్నూలుకు చెందిన అండర్-17 విభాగంలో సి మేఘన, బీ సుమియా, రేష్మలు రజత పతకాలు సాధించారు. వి.భవాని, గురు చిద్విలాస్‌లు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు ఆదివారం ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన అభినందన సభలో జిల్లా స్కూల్ గేమ్స్ ముఖ్య కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ముఖ్య కార్యదర్శి వెంకటేశ్వర్లు క్రీడాకారులు, కోచ్ అండ్ మేనేజర్లు యూసుఫ్, నాగేశ్వరిని అభినందించారు. రాష్ట్ర స్థాయిలో బాలికలు టీమ్ ఈవెంట్‌లో 3వ స్థానంలో నిలిచారని జిల్లా స్కూల్ గేమ్స్ ముఖ్య కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్‌లో ఎన్నో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ శేఖర్, కిశోర్, జిల్లా పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సేవాస్తంబ్‌కు పూర్వ వైభవం తీసుకొద్దాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మునిస్వామి

కర్నూలు(అర్బన్): జిల్లాలో అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగ సంఘాల సమాఖ్య (సేవాస్తంబ్) కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు జిల్లా అధ్యక్షులు మునిస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక ఇరిగేషన్ సర్కిల్ ప్రాంగణంలో సేవాస్తంబ్ జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కన్వీనర్ పూల వీరయ్య, కేంద్ర కమిటీ సభ్యులు డీపీ సోమన్న, ప్రధాన కార్యదర్శి గోపాల్, ఫైనాన్స్ సెక్రెటరీ గుర్రాల శ్రీనివాసులు, నాయకులు టీడీ గోవర్ధనగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సు, ఐక్యత కోసం స్వర్గీయ దామోదరం సంజీవయ్య స్థాపించిన సేవాస్తంబ్‌ను జిల్లాలో బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా సంఘం కార్యకలాపాలు విస్తరించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు జీతాలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ తదితర వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉందన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు సేవాస్తంబ్ కృషి చేయనుందన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు





శ్రీచౌడేశ్వరీదేవికి సారె సమర్పిస్తున్న మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, అలంకరణలో అమ్మవారు

కోడుమూరు రూరల్: నియోజక కేంద్రం కోడుమూరులో శ్రీచౌడేశ్వరీ దేవి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి ప్రభోత్సవం కనుల పండువగా జరిగింది. ఆదివారం ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, తనయుడు రాఘవేంద్రరెడ్డి, గ్రామ సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచులు సీబీ. లత, కేఈ రాంబాబు,కోట్ల కవితమ్మ చౌడేశ్వరీ దేవికి ఆదివారం సారె సమర్పించారు. ముందుగా వారు గ్రామ పంచాయతీ భవనం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి శ్రీచౌడేశ్వరీదేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు శ్రీచౌడేశ్వరీ దేవి రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా నేడు దేవి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అటగార దేవాంగ దైవచార సంఘం సభ్యులు తెలిపారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

కుడా చైర్మన్ రాక

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం చౌడేశ్వరీదేవికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథిగా కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్దన్‌రెడ్డి హాజరవుతున్నట్లు వెల్లడించారు.

నేడు ఉల్చాలలో 'గడప గడపకు'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఈ నెల 6వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్. భాస్కర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని వెల్లడించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

వలంటీర్లతో సమావేశం

సి.బెళగల్: గ్రామ వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ముందుగా పోలకల్‌లోని గ్రామ సచివాలయం – 3 ప్రాంగణంలో నిర్వహిస్తారని, అందులో పోలకల్, కొత్తకోట, ముడుమాల, కొండాపురం, ఇనగండ్ల సచివాలయాలకు చెందిన వారు హాజరవ్వాలన్నారు. సాయంత్రం మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సి.బెళగల్, కంబదహాల్, చింతమానుపల్లె, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి, సంగాల, బ్రాహ్మణదొడ్డి సచివాలయాల వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం జరుగుతుందన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

పాణ్యం: స్థానిక గ్రంథాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. అందులో భాగంగా ఈనెల 7వ తేదీన పాణ్యం గ్రంథాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆమె విలేకరులకు వెల్లడించారు. ''గ్రంథాలయాల అభివృద్ధి -ప్రజల భాగస్వామ్యం'' అనే అంశంపై జరిగే ఈ సమావేశానికి గ్రంథాలయాల చైర్మన్ సుభాస్‌చంద్రబోస్ హాజరవుతారని పాఠకులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేపు కాల్వబుగ్గలో సమావేశం

ఓర్వకల్లు: కాల్వబుగ్గ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు మొదలవుతాయన్నారు. చేపట్టాల్సిన ఏర్పాట్లు, వసతుల కల్పనపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

అలరించిన మధుర గీతాలు

కర్నూలు(హాస్పిటల్): ఘంటసాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆర్కెస్ట్రా కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపాత మధురాలు అలరించాయి. ఈ కార్యక్రమాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ ప్రారంభించారు. అనంతరం పాత సినిమాలతో పాటు కొత్త సినిమాల్లోని పాటలను ఇబ్రహీం, హబీబ్, శివప్రసాద్, సంతోషి, రాగిని బృందం ఆలపించి అందరినీ ఆకట్టుకుంది.

పారదర్శకంగా విద్యుత్ బిల్లులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు పారదర్శకంగా తీసేందుకు చర్యలు చేపట్టాలని కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న అన్నారు. ఆదివారం ఆయన కింది స్థాయి సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలవారి బిల్లులు తీయడంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వీటిపై మీటర్ రీడర్లకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు ఇవ్వాలని, ప్రతి ఇంటి మీటర్ వద్దకు వెళ్లి రీడింగ్ స్కాన్ చేసే బిల్లింగ్ తీసేలా చూడాలన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

వీరంతా 30 ఏళ్ల క్రితం 1993–94వ సంవత్సరంలో కర్నూలు నగర పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో ఉన్న శ్రీదుర్గా విద్యానికేతన్‌లో కలిసి పదోతరగతి చదువుకున్నారు. ఆ తర్వాత ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన వీరు ఆదివారం కర్నూలు మండలం వెంకాయపల్లె సమీపంలోని శ్రీనివాస గార్డెన్‌లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు.

–కర్నూలు (న్యూటౌన్)



నాటి ఉపాధ్యాయులతో శ్రీదుర్గా విద్యానికేతన్ పూర్వపు విద్యార్థులు

పిల్లల్లో ఎదుగుదల లోపాలను గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్): పిల్లలో ఎదుగుదల లోపాలను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని ఒంగోలుకు చెందిన చిన్నపిల్లల వైద్యులు, ఐఏపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురళీధర్‌రెడ్డి చెప్పారు. చిన్నపిల్లల్లో వచ్చే ఎదుగుల లోపాల గురించి ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాటిక్స్(ఐఏపీ) కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుకు తగ్గ పిల్లలు ఎగుదుతున్నారా లేదా అని చికిత్స కోసం వచ్చిన తల్లిదండ్రులను వైద్యులు అడిగి తెలుసుకోవాలన్నారు. పిల్లల్లో ఎదుగుదల లోపాలు, మానసిక ఎదుగుదల లోపాలుంటే త్వరగా గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఇలాంటి పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఏపీ కర్నూలు అధ్యక్షులు డాక్టర్ కుమారస్వామిరెడ్డి, కార్యదర్శి డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శారద, డాక్టర్ రవికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రకాష్ ఆనంద్, డాక్టర్ నాగార్జున, సీనియర్ వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ రఫిక్ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో బురాన్‌దొడ్డి విద్యార్థి ప్రతిభ



బురాన్‌దొడ్డి విద్యార్థి మురళికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తున్న డీఈఓ

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మురళి అనే విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని ఆ పాఠశాల హెచ్ఎం నిర్మల వసంత కుమారి ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం కర్నూలులోని టౌన్‌మోడల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థి మురళి ఆల్కాహాల్ డిటెక్టింగ్ ఇంజిన్ లాకింగ్ సిస్టంను ప్రదర్శించారని హెచ్ఎం తెలిపారు. ఈ ప్రదర్శన పలువురు జిల్లా అధికారులను ఆకట్టుకోవడంతో పాటు రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రంగారెడ్డి తమ విద్యార్థికి మెమెంటో, ప్రశంసా పత్రం అందించినట్లు చెప్పారు.

ఐక్యతతో క్రీడాభివృద్ధికి కృషి చేద్దాం

కర్నూలు (టౌన్): జిల్లాలోని క్రీడా సంఘాలు అన్ని కలిసి కట్టుగా ఐక్యతతో క్రీడాభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్సీ, జిల్లా ఒలంపిక్ సంఘం అడ్‌హక్ కమిటీ చైర్మన్ కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక రాజ్ విహార్ సమీపంలోని కేఈ ప్లాజాలో కన్వీనర్ మల్లికార్జునరెడ్డి అధ్యక్షత జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం, ఒలంపిక్ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడం, క్రీడాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షకులుగా శిక్షకుడు కాశీరావు, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘం నుంచి వైఎస్సార్ జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు సమరనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా న్యాయవాది సుభాన్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేఈ జగదీప్‌కుమార్ (అధ్యక్షులు), జి.శ్రీనివాసులు (ప్రధాన కార్యదర్శి), శ్రీధర్ (కోశాధికారి), ఎస్వీ గంగాధర్ గౌడ్, శోభన్‌బాబు, రాజశేఖర్, ఎస్.అహ్మద్ షరీఫ్ (ఉపాధ్యక్షులు) అవినాష్, శ్రీనివాసులు, వేణుగోపాల్, నరసింహులు (సంయుక్త కార్యదర్శులు), కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రుద్రారెడ్డి, ఆదినారాయణ, సురేంద్ర ఎంపికయ్యారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పురోగతిలో మీ శ్రమ వెలకట్టలేనిది

- 1983 బ్యాచ్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ల ఆత్మీయ సమావేశంలో ఆర్ఎం



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వెంకటరామం

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ పురోగతి కోసం పడిన శ్రమ వెలకట్టలేనిదని ప్రజా రవాణ శాఖ జిల్లా అధికారి టి. వెంకటరామం అన్నారు. ఆదివారం స్థానిక రాజ్‌విహార్ సమీపంలోని జ్యోతి మాల్ సమావేశపు హాలులో 1983 బ్యాచ్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ల ఆత్మీయ సమావేశం రిటైర్డు డిపో మేనేజరు కేడీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1983లో సంస్థ పరిస్థితి ఎంతో బాగుండేదన్నారు. ఆ తరువాత కొన్ని కారణాలతో నష్టాలు ఎదర్కొంటూ వచ్చిందన్నారు. అలాంటి సమయంలో సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, డిపో మేనేజర్లుగా విధులు నిర్వహించిన మీ సేవలు ఎంతో విలువైనవి అన్నారు. బస్సుల నిర్వహణ, ఉద్యోగుల సమస్యలు, కార్మిక సంఘాల నాయకులు ఒత్తిళ్లు, పై అధికారుల ఆదేశాలు, ధర్నాలు, సమ్మెలు ఇలా అనేక సమస్యలు ఎదురవుతున్నా.. వాటిని అధిగమించుకుంటూ ముందుకు వెళ్లారని కొనియాడారు. వారి సేవల పట్ల అభినందనలు తెలిపారు. మిగిలిన శేష జీవితం ఆరోగ్యంగా, ఉల్లాసంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రిటైర్డు డీఎం కేడీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తాము సూపర్‌వైజర్లుగా ఉద్యోగంలో చేరి ఇప్పటికే 40 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. తమ సర్వీసులో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, సంస్థ పురోగతి, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశామని పేర్కొన్నారు. తోటి మిత్రుల సమస్యలు తెలుసుకునేందుకు ఆత్మీయ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు కేవీ రమణ, రిటైర్డు డిపో మేనేజర్లు గద్వాల ఈరన్న, సీఎంఎస్ రెడ్డి, అజహర్, సోమశేఖరరెడ్డి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ఆ బ్యాచ్ రిటైర్డు అధికారులు పాల్గొన్నారు.